# సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024






**2.13 నిమిషాలు..**

చాదర్‌ఘాట్ ప్రాంతంలోని కిస్వా జ్యువెలరీ దుకాణంలో దోపిడీకి ఒడిగట్టిన నిందితులను పోలీసులు గుర్తించారు. 8లో▸



**జల్సాలకు అలవాటుపడి..**

జల్సాలకు అలవాటుపడి ఆలయాల్లో దోపిడీలకు పాల్పడుతున్న దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



**నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

నాగులమ్మ విగ్రహాల ప్రతిష్టాపనను వేదపండితులు, పూజారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో▸

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

ఆమనగల్లు: గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యం తెలిపారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో గురువారం 3వ ఓపెన్ టూ ఆల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ గోదాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే టోర్నమెంట్‌కు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో టీంలు వచ్చాయి. అంతకు ముందు ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ శ్రీనివాస్, స్థానిక నాయకులు శ్రీను, జంగయ్య, కృష్ణరావ్, ప్రసాద్, వెంకటయ్య, పీఈటీలు మల్లేశ్, చంద్రమోహన్, ప్రసాద్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

### హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



మహేందర్‌ను సత్కరించిన నాయకులు

ఆమనగల్లు: బీసీల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.బొల్లు మహేందర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్స్‌లో గురువారం ఆయనను బీసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. మహేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని, 60 శాతం ఉన్న బీసీలకు తక్కువ మొత్తంలో నిధులు కేటాయించారని మండిపడ్డారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు విజయ్, విష్ణుచారి, శ్రీను, సర్పరాజ్, రామదాసు, నరేందర్, రవిరాథోడ్, ప్రతాప్‌రెడ్డి, నవీన్, కృష్ణయ్య, విజయ్‌భాస్కర్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సీసీఆర్ జిల్లా ప్రతినిధిగా శ్రీనివాస్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

కేశంపేట: సీసీఆర్ (కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్) ఆర్గనైజేషన్ జిల్లా ప్రతినిధిగా కేశంపేట మండల పరిధిలోని కాకునూర్‌కి చెందిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆ ఆర్గనైజేషన్ జిల్లా ఇన్‌చార్జి అశోక్ కుమార్.. శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. పౌరహక్కులు, ప్రభుత్వ పథకాలు, చట్టాలపై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని శ్రీనివాస్ తెలిపారు.

### యాచారం తహసీల్దార్‌గా అయ్యప్ప



యాచారం: యాచారం మండల తహసీల్దార్‌గా అయ్యప్ప గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్‌రెడ్డి యదాద్రి జిల్లాకు బదిలీపై వెళ్లగా.. నందిగామ మండలం నుంచి అయ్యప్ప ఇక్కడకు బదిలీపై వచ్చారు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. నూతన తహసీల్దార్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### చెరువుల పరిశీలన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆరు చెరువులను గురువారం అధికార యంత్రాంగం పరిశీలించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే ఆదేశంపై నియమించిన అడ్వకేట్ కమిషనర్లతో పాటు జీహెచ్ఎంసీ, నీటిపారుదల, రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. మాదాపూర్‌లోని దుర్గం చెరువు, గుట్టలబేగంపేట సున్నంచెరువు, నానక్‌రాంగూడ మేడికుంట తదితర చెరువులను వారు పరిశీలించారు. చెరువుల పరిసరాల పరిస్థితి, సుందరీకరణ, ఆక్రమణలనపై నివేదిక అందజేయనున్నారు.

# నీళ్ల గండం

## శివారు మున్సిపాలిటీల్లో తాగునీటికి ఇబ్బందులు



నగర శివారులోని ఓ కాలనీలో ట్యాంకర్ వద్ద మహిళల క్యూ

**మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని నీటి కనెక్షన్ల వివరాలు (మార్చి 2022 వరకు)**

| స్థానిక సంస్థలు | వార్డులు | మొత్తం భవనాలు | నీటికనెక్షన్ ఉన్నవి |
|---|---|---|---|
| ఆదిబట్ల | 15 | 3,904 | 753 |
| బడంగ్‌పేట్ | 32 | 30,126 | 26,683 |
| బండ్లగూడ | 22 | 9,526 | 13,058 |
| ఇబ్రహీంపట్నం | 24 | 12,618 | 7,525 |
| జల్‌పల్లి | 28 | 24,600 | 14,106 |
| కొత్తూరు | 12 | 2,666 | 2,344 |
| మణికొండ | 20 | 10,789 | 5,449 |
| మీర్‌పేట్ | 46 | 29,422 | 14,672 |
| నార్సింగి | 18 | 11,079 | 3,230 |
| పెద్ద అంబర్‌పేట్ | 24 | 16,905 | 8,246 |
| శంషాబాద్ | 25 | 20,104 | 6,645 |
| శంకర్‌పల్లి | 15 | 6,216 | 4,886 |
| తుక్కుగూడ | 15 | 5,400 | 8,907 |
| తుర్కయంజాల్ | 24 | 25,290 | 8,915 |
| షాద్‌నగర్ | 28 | 18,005 | 4,922 |
| ఆమనగల్లు | 15 | 5,200 | 4,475 |

- నల్లా కనెక్షన్లు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం
- దాదాపు లక్ష నివాసాలకు బోరునీళ్లే దిక్కు
- మరోవైపు అడుగంటుతున్న భూగర్భజలాలు
- ట్యాంకర్లతో నీటి సరఫరా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓవైపు శివార్లలో నగరీకరణ శరవేగంగా విస్తరిస్తుంటే మరోవైపు దానికనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరగడంలేదు. శివార్లలో ఆకాశహర్మ్యలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు ఆదాయార్జనలో వీటి వాటానే ఎక్కువ. రోడ్లు, డ్రైనేజీలే కాదు ఇక్కడివారికి దాహం వేస్తే తాగేందుకు గుక్కెడు తాగునీళ్లు కూడా దొరకని పరిస్థితి ఉంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ మహానగర శివారులోని 13 పురపాలికలు, మూడు నగరపాలికల పరిధిలో 363 వార్డులు ఉండగా వీటి పరిధిలో దాదాపు 2,31,746 భవనాలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 35 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. మొత్తం భవనాల్లో 1,30,681 గృహ, 3,904 వాణిజ్య భవనాలకే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. సుమారు మరో లక్ష భవనాలకు ఇప్పటి వరకు మంచినీటి సౌకర్యం లేదు. దీంతో వారంతా భూగర్భ జలాల(బోరు నీళ్ల)పైనే ఆధారపడుతున్నారు. వీరిలో కొంతమంది ఈ నీటితోనే తాగునీటి అవసరాలు తీర్చుకుంటుండగా మరికొంత మంది స్థానికంగా లభించే రక్షిత నీటి (ఫిల్టర్ వాటర్)పై ఆధారపడుతున్నారు.

**పడిపోయిన భూగర్భ జలాలు..**

విస్తరిస్తున్న కాలనీలు, నిర్మాణాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మంచి నీటి పైపులైన్లను విస్తరించాల్సిన ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత పదేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం వర్షాలు తక్కువ కురిశాయి. సమీపంలోని చెరువులు, కుంటలు కూడా ఎండిపోయాయి. భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. దీనికి తోడు వేసవి కాలం సమీపిస్తుండటం, ఇప్పటికే ఇళ్లలోని బోర్లు కూడా ఎండిపోవడంతో శివారు మున్సిపాలిటీల్లోని ప్రజలు నీటికోసం అల్లాడుతున్నారు.

**నీటి సరఫరా నిలిచిపోయింది**



కొత్తూరు మున్సిపాలిటీకి ఏడాదిన్నర నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు పాత జాతీయ రహదారి విస్తరణ వలన గతంలో వేసిన పైపులు ధ్వంసమయ్యాయి. సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– శ్రీనివాస్, 6వ వార్డు, కొత్తూరు

**బోరు నీరే తాగుతున్నాం**



కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో దాదాపుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పైపు లైన్లు, నల్లాలను బిగించారు. అయితే సుమారు ఏడాదిన్నరగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో బోరు నీరే తాగుతున్నాం. అధికారులు స్పందించి వేసవిలోగా మున్సిపాలిటీకి నీటి సరఫరాను పునరుద్ధరించాలి.

– సురేందర్, ఎస్సీ కాలనీ, కొత్తూరు

**అధికారులు పట్టించుకోవడం లేదు**



ఆదిబట్ల మున్సిపాలిటీలో ప్లాట్ కొని ఇళ్లు కట్టుకున్నాం. ప్రస్తుతం ఇక్కడ తాగునీరు కూడా దొరకని పరిస్థితి. ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని అధికారులను కోరినాఇప్పటివరకు ఇవ్వలేదు. నిత్యావసరాలకు బోరునీళ్లు వాడుదామన్నా అవికూడా అడుగంటాయి. వెంటనే నీటి సరఫరా చేపట్టాలి.

– సుబ్బారెడ్డి, ఆదిబట్ల



చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్ రత్నం

# దేశ ప్రతిష్టను పెంచిన మోదీ

- బీజేపీ నేత ఈటల రాజేందర్
- పార్టీలో చేరిన చేవెళ్ల ఎంపీపీ దంపతులు

చేవెళ్ల: దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలకు కాలం చెల్లిందని, నరేంద్రమోదీ ప్రధాని అయిన తరువాత దేశ గౌరవం, ప్రతిష్ట పెరిగిందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో స్థానిక ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ఆమె భర్త రమణారెడ్డి అనుచరులతో కలిసి బీఆర్ఎస్ వీడి బీజేపీలో చేరారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో వారికి ఈటల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంపూర్ణ మద్దతు మోదీకే ఉందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించి 140కోట్ల మంది ప్రజల మనస్సు గెలిచారని పేర్కొన్నారు. మోదీ పాలనలో భారతదేశం పక్క దేశాలకు సహాయం చేసే స్థాయికి ఎదిగిందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దేశవ్యాప్తంగా 400ల సీట్లు వస్తాయని, మళ్లీ కేంద్రంలో మాదే అధికారమని అన్నారు. తెలంగాణలోని 17సీట్లు గెలిపించుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతో మంచి వ్యక్తి అని, ఆపదలో ప్రజలను ఆదుకుంటారని అన్నారు. అలాంటి వ్యక్తిని భారీ మెజార్టీతో పార్లమెంట్‌కు పంపాలని కోరారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నరేశ్, దేవుని శర్వలింగం, కృష్ణాగౌడ్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, సురేశ్, నరేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మోదీ పాలన నచ్చి బీజేపీలోకి..**

ప్రధాని మోదీ సుపరి పాలన, అభివృద్ధి చూసి బీజేపీలో చేరినట్లు చేవెళ్ల ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ఆమె భర్త రమణారెడ్డి తెలిపారు. వారితోపాటు మాజీ ఎంపీపీ ఎం విజయ్‌భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివానందం, వైభవ్‌రెడ్డి, దేవుని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, ఉప సర్పంచులు రాజిరెడ్డి, రాధిక, బీఆర్ఎస్ కౌకుంట్ల రైతు సంఘం అధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి, బస్తేపూర్ మాజీ సర్పంచ్ జంగయ్య, చేవెళ్ల మాజీ సర్పంచ్ వెంకటమ్మ, అల్లవాడ మాజీ సర్పంచ్ అనురాధ, బీఆర్ఎస్ దేవుని ఎర్రవల్లి బీసీ సెల్ అధ్యక్షుడు రాములు, నాయకులు శశిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్, యాదయ్య, మోజాహన్‌రెడ్డి, రాజు, చంద్రశేఖర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బీజేపీలో చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# సేవాలాల్ బాటలో నడవాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్: సంత్ సేవాలాల్ మహరాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణం టీచర్స్ కాలనీలో సేవాలాల్ ఆలయంలో గురువారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి మాట్లాడుతూ... గిరిజనుల్లో నిరక్షరాస్యత, పేదరికం, అనాగరికతను పారదోలేందుకు సేవాలాల్ ఎంతో కృషిచేశారన్నారు. యువత ఆయన బాటలో నడవాలన్నారు. ఈ సమావేశంలో యాదయ్య యాదవ్, మిట్టు నాయక్, మంగులాల్ నాయక్, వాల్యా నాయక్, నెహ్రు నాయక్, శ్రీను నాయక్, ఆర్డీఓ వెంకట మాధవరావు, తహసీల్దార్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# జనవాడ ఘటనలో 11 మందికి రిమాండ్

- 30 మందిపై కేసులు నమోదు
- 21వరకు గ్రామంలో 144 సెక్షన్
- మోకిల సీఐ వీరబాబు

శంకర్‌పల్లి: మండలంలోని జనవాడలో సీసీ రోడ్డు వేస్తుండగా తలెత్తిన చిన్నపాటి వివాదం గ్రామంలో 144 సెక్షన్ పెట్టే వరకూ వెళ్లింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న గొడవ ఇరువర్గాల మధ్య దాడులకు దారితీసింది. ఈ ఘటనలో తీవ్ర గాయా లపాలైన పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్డు వేసే విషయమై చర్చి ఎదుట మూడు ఫీట్లు వదిలి పెట్టాలని ఓ వర్గం.. చర్చికి ఆనుకుని వేస్తామని మరోవర్గం మధ్య నెలకొన్న గొడవ చినికిచినికి గాలివానలా మారింది. ఇరు వర్గాలవారు రాళ్లు, కర్రలు, ఇటుకలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ విషయం పోలీసులకు చేరడంతో గ్రామానికి చేరుకుని బుధవారం ఉదయం 144 సెక్షన్ విధించారు. గురువారం 11మందిని అదుపులోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని మోకిల సీఐ వీరబాబు తెలిపారు. దాడికి కారకులైన మరో 30మందిపై కేసులు నమోదు చేసినట్లు స్పష్టంచేశారు. వీరిలో 11మందిని రిమాండ్‌కు తరలించగా మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈనెల 21 వరకు గ్రామంలో 144 సెక్షన్ అమలులో సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రశ్మీ పెరుమాళ్ గ్రామాన్ని పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని ఆదేశించారు.

# అవిశ్వాసం నెగ్గేనా?



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం, చైర్‌పర్సన్ స్రవంతి

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై నేడు అవిశ్వాస సమావేశం
- అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్‌పర్సన్
- ఎలాగైనా అవిశ్వాసం నెగ్గుతామంటున్న ప్రతిపక్ష కౌన్సిలర్లు
- సరిపడా కోరం ఉందంటూ ధీమా
- ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి నమోదుతో కొత్త ట్విస్టు
- తీర్మానం వీగుతుందా, నెగ్గుతుందా అని సర్వత్రా ఆసక్తి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై నేడు సమావేశం జరగనుంది. గత నెలలో 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు మొత్తం 17 మంది సంతకాలు చేసి కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. తదనంతరం అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం సభ నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారు. ఇప్పుడు స్థానికంగా ఈ అవిశ్వాస తీర్మానం హాట్ టాపిక్‌గా మారింది. చైర్‌పర్సన్ ప్రస్థానాన్ని ఒకసారి పరిశీలిస్తే.. కప్పరి స్రవంతి విద్యావంతురాలు. కొత్తలో ఆమెకు రాజకీయాలు అంటే పెద్దగా అవగాహన లేదు. ఆమె మామ కప్పరి లక్ష్మయ్య ఇబ్రహీంపట్నం సర్పంచ్‌గా గతంలో పనిచేసిన అనుభవంతోపాటు రాజకీయాల్లో కొనసాగుతుండటం ఆమెకు కలిసొచ్చింది. గత మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ మహిళ కౌన్సిలర్ స్థానం నుంచి ఎస్సీ మహిళైన కప్పరి స్రవంతి బీఆర్ఎస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎస్సీ జనరల్‌కు రిజర్వైన మున్సిపల్ చైర్మన్ పదవి పురుషులకు కాకుండా ఆమె దక్కించుకుంది. అయితే పదవిలోకి వచ్చిన కొన్ని నెలలకే మెజార్టీ కౌన్సిలర్లు తిరుగుబాటు చేసి అసమ్మతిరాగం మొదలెట్టారు. దీనికి ప్రధాన కారణం అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో విభేదాలు చోటు చేసుకోవడమే ప్రధాన కారణం. అయితే మూడేళ్ల కాలపరిమితి ముగియగానే గతేడాది జనవరి 27న సుమారు 20 మంది కౌన్సిలర్లు (మొత్తం 24 మంది) సంతకాలు చేసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని అధికారులకు అందజేశారు. అయితే త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అవిశ్వాసాల జోలికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వెళ్లకుండా కాలయాపన చేసింది. అంతేగాక అవిశ్వాస కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచుతూ చట్ట సవరణ బిల్లు చేసింది. ఈ బిల్లును గవర్నర్ అప్పట్లో ఆమోదించలేదు. దీనిని సాకుగా చూపి రాష్ట్రంలోని పలువురు మున్సిపల్ చైర్మన్లు అవిశ్వాస తీర్మాలాపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈలోపు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడటం షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల కావడంతో మరో సంవత్సరం చైర్‌పర్సన్ స్రవంతికి పదవిలో కొనసాగే అవకాశం దక్కింది. ఈ దశలో అనూహ్యంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్రవంతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించడం కూడా స్రవంతికి కలిసొచ్చినట్లయ్యింది. ఎన్నికల ముందు ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**నేడే అవిశ్వాస సమావేశం...**

ఒకవర్గం చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించాలని, మరో వర్గం పదవిని కాపాడుకోవాలని చేస్తున్న ప్రయత్నాలతో పట్నంలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని సంతకాలు చేసిన 40 రోజుల నిరీక్షణకు శుక్రవారం తెరపడనుంది. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కౌన్సిలర్లకు సమాచారం అందజేశారు. అయితే.. చైర్‌పర్సన్‌తో కలిసి మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాసం నెగ్గాలంటే 16 మంది కౌన్సిలర్ల మద్దతు తప్పనిసరి. ఈ క్రమంలో 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లతో కలిపి 17 మంది ప్రత్యర్థి వర్గ శిబిరంలో ఉండటంతో కప్పరి స్రవంతి పదవి పోవడం ఖాయంగా అందరూ భావించారు. అవిశ్వాస గడువు సమీపిస్తున్న దశలో గత నాలుగైదు రోజులుగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి శిబిరంలోకి మరో ఇద్దరు కౌన్సిలర్లు వచ్చి చేరినట్లు తెలిసింది. ప్రత్యర్థి శిబిరంలో 16 మంది కౌన్సిలర్ల కంటే తక్కువగా ఉంటే చైర్‌పర్సన్ పదవికి ఢోకాలేదు. ఈ నేపథ్యంలో ఇద్దరు కౌన్సిలర్లు స్రవంతి శిబిరంలో చేరడంతో ప్రత్యర్థి బలం 15కు పడిపోయింది. దీంతో ప్రత్యర్థి శిబిరంలో నైరాశ్యం మొదలైంది. ఈ దశలో స్రవంతి శిబిరం నుంచి గురువారం ఓ కౌన్సిలర్ చేజారినట్లు సామాచారం.

**తెరపైకి ఎక్స్‌అఫీషియో ట్విస్టు..**

ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పేరు నమోదు చేసుకున్నట్లు సమాచారం. దీంతో మొత్తం సభ్యుల సంఖ్య 25కు చేరుతుంది. ఈదశలో చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసం నెగ్గాలంటే ప్రత్యర్థి శిబిరానికి 17 మంది సభ్యుల మద్దతు కావాల్సిన అవసరం ఉంది. ఇక చైర్‌పర్సన్ శిబిరం నుంచి ఏ ఒక్క కౌన్సిలర్ చేజారకుండా ఉంటే మళ్లీ అదృష్టం కప్పరి స్రవంతినే వరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆది నుంచి స్రవంతికి కాలం కలిస్తోందని.. ఆమె పదవికి ఎలాంటి ఇబ్బంది ఉండదని పలువురు చర్చించుకుంటున్నారు. సంవత్సరకాలంగా పదవి నుంచి దించాలని ప్రయత్నిస్తున్న అసమ్మతి కౌన్సిలర్ల ఆశలు గాలిలో పెట్టిన దీపంలా ఊగిసలాడుతున్నాయి. ఏది ఏమైన శుక్రవారం రోజున స్రవంతిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గుతుందా లేక వీగిపోతుందా తేలిపోనుంది... అప్పటివరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది.

**200 మందితో పోలీసు బందోబస్తు**

ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై శుక్రవారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని అష్టదిగ్బంధం చేశారు. కార్యాలయానికి వచ్చేందుకు పలుమార్గాలు ఉన్నాయి. ఈ క్రమంలో అన్ని మార్గాల గుండా రాకపోకలు సాగకుండా స్టాపర్స్‌ను, కట్టెలతో బారిగేడ్లను కట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీసులను బందోబస్తులో ఉంచినట్లు తెలుస్తుంది. అవిశ్వాస సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డి వ్యవహరించనున్నారు. 2/3 మెజార్టీ సభ్యులు రానిపక్షంలో సమావేశాన్ని వాయిదా వేస్తామని... తిరిగి అదేరోజు మరోసారి అవకాశాన్ని కల్పించి అరగంట పాటు నిరీక్షిస్తామని తెలిపారు. ఈలోపు కౌన్సిలర్లు హాజరై వారిచ్చిన అవిశ్వాస నోటీసులపై ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

## కిక్ బాక్సింగ్‌లో మెడల్స్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ న్యూ దుర్గాహిల్స్ ప్రాంతానికి చెందిన రావుల యశశ్రీ రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్, బ్రౌంజ్ మెడల్స్ సాధించింది. దుర్గానగర్‌లోని ఫ్లైయింగ్ స్టార్ బాడ్మింటన్ అకాడమీలో యశశ్రీ శిక్షణ తీసుకున్నది. యశశ్రీ కర్మన్‌ఘట్‌లోని నాగార్జున స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నది.



## జల్సాలకు అలవాటుపడి చోరీలు

### ఆలయం లూటీ చేసిన కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సింహారావు

కొత్తూరు: జల్సాలకు రుచి మరిగిన కేటుగాళ్లు ఆలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. అందిక కాడికి దోచుకొని ఉడాయించారు. ఆ నిందితులను కొత్తూరు పోలీసులు చాకచక్యంగా గురువారం అరెస్టు చేశారు. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు పట్టణంలోని భవానీనగర్ కాలనీలో ఉన్న మందోనిబాయి మైసమ్మ ఆలయంలో ఈ నెల 12న నిందితులు చోరీకి పాల్పడి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు, హుండీలో ఉన్న నగదు, పూజకు ఉపయోగించే రాగి, ఇత్తడి వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటనపై ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక పోలీసులు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎంఆర్‌ఎఫ్ షోరూం పక్కన వెంచర్లో పెట్రోలింగ్ చేస్తుండగా పట్టణంలో నివసిస్తున్న రాహుల్‌సింగ్(21), శనిదేవ్(20), నందిగామ మండలం రంగాపూర్‌కు చెందిన మహేందర్(22)లు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మైసమ్మ ఆలయంలో చోరీ చేసిన విషయాన్ని తెలిపారు. అనంతరం వారి నుంచి అమ్మవారి అలంకారానికి ఉపయోగించే బంగారు, వెండి ఆభరణాలు, పూజకు వినియోగించే ఇత్తడి, రాగి వస్తువులతో పాటు రూ.22,250, కారును రికవరీ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనకు కృషి చేసిన ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ అబ్దుల్లాతో పాటు ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.

# 2.13 నిమిషాలు.. 150 గ్రాముల బంగారం!

**అక్బర్‌బాగ్ దోపిడీ 3 నిమిషాల్లోపే పూర్తి**

- కస్టమర్‌గా వచ్చిన వ్యక్తి సైతం నిందితుడిగా నిర్ధారణ
- నిందితుల గుర్తింపు, పోలీసుల అదుపులో ఇరువురు



1,3: దోపిడీ దొంగలు, 2: బాధితుడు, 4: వినియోగదారుడిగా వచ్చిన నిందితుడు

సాక్షి, సిటీబ్యూరో: సౌత్ ఈస్ట్ జోన్‌లో ఉన్న చాదర్‌ఘాట్ ప్రాంతంలోని కిస్వా జ్యువెలరీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం దోపిడీకి ఒడిగట్టిన నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరు, కస్టమర్‌గా నటించిన మూడో వ్యక్తి పాతబస్తీకి చెందిన వ్యక్తిగా తేల్చారు. గురువారం రాత్రి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు పరారీలో ఉన్న మూడో వ్యక్తిని పట్టుకోవడంతో పాటు దోపిడీకి గురైన సొత్తు రికవరీ చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దుకాణంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా కేవలం 2.13 నిమిషాల్లోనే దోపిడీ దొంగలు 150 గ్రాముల బంగారం దోచుకుపోయినట్లు తేల్చారు. సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాల ఆధారంగా బుధవారం మధ్యాహ్నం ఏ క్షణాన ఏమి జరిగిందంటే..

**1.25 గంటల 26 సెకండ్లు:**
తలకు టోపీ, ముఖానికి మాస్క్ ధరించి వచ్చిన ఓ యువకుడు దుకాణంలోకి వచ్చాడు. వినియోగదారుడిగా నటిస్తూ క్యాష్ కౌంటర్‌లో కూర్చుకున్న యజమాని కుమారుడు సజావుర్ రెహ్మాన్‌ను వెండి గొలుసులు చూపించాలని అడిగాడు.

**1.26 గంటల 08 సెకన్లు:**
డబీర్‌పుర ఫ్లైఓవర్ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఈ దుకాణం ఎదురుగా ఆగారు. వీళ్లు కూడా 'వినియోగదారుడి' మాదిరిగానే మాస్కులతో పాటు ఒకరు టోపీ, మరొకరు హెల్మెట్‌తో ఉన్నారు.

**1.26 గంటల 12 సెకన్లు:**
'వినియోగదారుడు' కోరిన వెండి గొలుసులతో కూడిన బాక్సును తీసుకువచ్చిన సజావుర్ రెహ్మాన్ కౌంటర్‌పై పెట్టి చూపిస్తున్నారు. దుకాణంలో ఇంకా ఎవరైనా ఉంటే మిగిలిన ఇద్దరినీ అప్రమత్తం చేసి, దోపిడీ వాయిదా వేయించడమే ఈ దుండగుడి ఆలోచనగా పోలీసులు తేల్చారు.

**1.26 గంటల 16 సెకన్లు:**
ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిలో బైక్ వెనుక కూర్చున్న దుండగుడు చేతిలో సంచితో దుకాణంలోకి ప్రవేశించాడు. క్యాష్ కౌంటర్ ఎదురుగా ఉన్న కుర్చీ ఎక్కి కౌంటర్ మీదకు చేరాడు. ఇతడిని సజావుర్ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వెనక్కు దిగాడు.

**1.26 గంటల 23 సెకన్లు:**
తన నడుం వద్ద దాచి ఉంచిన కత్తిని బయటకు తీసి, క్యాష్ కౌంటర్ దాటిన ఈ దుండగుడు సజావుర్ రెహ్మాన్‌పై దాడికి దిగాడు. ఈ దారుణం జరుగుతున్నంతసేపూ అక్కడే ఓ పక్కగా ఉండిపోయిన 'వినియోగదారుడు' అడ్డుకోవడానికి లేదా స్థానికులకు అప్రమత్తం చేయడానికీ ప్రయత్నించకపోవడం గమనార్హం.

**1.26 గంటల 36 సెకన్లు:**
అప్పటి వరకు వాహనం వద్దే ఉండిపోయిన రెండో వ్యక్తి హెల్మెట్‌తో సహా దుకాణంలోకి ప్రవేశించాడు. మొదటి వాడు సజావుర్ రెహ్మాన్‌ను షోకేస్‌కు, కౌంటర్‌కు మధ్య పడేసి ఒడిసి పట్టుకోగా... రెండో వాడు ఆభరణాల బాక్సుల్ని సంచిలో సర్దుకున్నాడు.

**1.27 గంటల 23 సెకన్లు:**
ద్విచక్ర వాహనం దిగి, మొదటగా దుకాణంలోకి వచ్చిన దుండగుడు సొత్తుతో, అంతకు ముందే వచ్చిన 'వినియోగదారుడు' హడావుడిగా బయటకు వెళ్లిపోయారు. ఆ సమయంలో వీరి మధ్య ఏదో సమాచార మార్పిడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**1.27 గంటల 39 సెకన్లు:**
కిందపడి ఉన్న సజావుర్ రెహ్మాన్‌ను బెదిరించిన రెండో దుండగుడు సైతం దుకాణం నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటికే వాహనం వద్ద ఆగి ఉన్న మరో దోపిడీ దొంగతో కలిసి ఉడాయించాడు.

## అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

షాబాద్: అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుందన్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. షాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న కుందన్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో రంజిత్‌కుష్వల్, సీత అన్నాచెల్లెలు పని చేస్తున్నారు. బుధవారం ఉదయం సోదరుడు కూలీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా సీత(20) విగత జీవిగా మారింది. ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అనారోగ్య సమస్యతో రెండు రోజుల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లో ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి తల్లి, అక్క, అన్న, తమ్ముడు ఉన్నారు. గురువారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వేద పండితులు

మొయినాబాద్ రూరల్: నాగులమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనను వేదపండితులు, పూజారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో ఎలిగెని సత్యనారాయణ దంపతులు పాల్గొని గణపతి హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు.

## యువకుడి బలవన్మరణం



శేషు (ఫైల్)

యాచారం: ఇంట్లోనే ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గునుగల్ గ్రామానికి చెందిన గొట్టం జంగయ్య, అండాలు దంపతుల కుమారుడైన శేషు(25) బుధవారం సమీప బంధువుల శుభకార్యంలో పాల్గొన్నాడు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తెల్లవారే సరికే శేషు విగతజీవిగా కనిపించాడు. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు.

## గోవా క్యాంప్‌నకు మణికొండ కౌన్సిలర్లు

మణికొండ: అవిశ్వాసం తేదీ సమీపిస్తుండడంతో మణికొండ మున్సిపల్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్‌పై పది మంది కౌన్సిలర్లు గత నెల కలెక్టర్‌కు అవిశ్వాసం లేఖ ఇచ్చినప్పటి నుంచి స్థానికంగా మెజార్టీ కౌన్సిలర్లు గురువారం గోవా బాట పట్టారు. అవిశ్వాసం నెగ్గాలంటే 13 మంది సభ్యుల బలం కావాలి. అయితే పది మంది కౌన్సిలర్లు సంతకాలతో కలెక్టర్‌కు లేఖ అందించడం, 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ కె.లమి అనూహ్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులోకి రావడంతో వారి బలం 11కు పెరిగింది. ఇక వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తటస్థంగా ఉన్నారు. అతను వారికి మద్దతు పలికినా వారి సంఖ్య 12కు చేరుకోనున్నది. వీరికి మరో సభ్యుడు మద్దతు తెలిపితే తప్ప అవిశ్వాసం నెగ్గే సూచనలు కనిపించడం లేదు. అయితే అవిశ్వాసం పెట్టిన కొందరు కౌన్సిలర్లతో ఈ మధ్య చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఫోన్లు చేసి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ విషయం తెలుసుకున్న పది మంది వరకు కౌన్సిలర్లు క్యాంప్‌నకు వెళ్లి ఈనెల 22వ తేదీనే నేరుగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలనే నిర్ణయానికి వచ్చి గోవాకు వెళ్లినట్లు సమాచారం. వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ బి.కావ్య స్థానికంగానే ఉన్నట్లు తెలిసింది.

## యువతి అదృశ్యం



అనురాధ (ఫైల్)

మొయినాబాద్: పని చేసే చోట జీతం తీసుకోవడానికంటూ వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. మొయినాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ మండలం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన బాయికాడ భగవంత్ కుటుంబం కొంత కాలం క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. భగవంత్ కూతురు అనురాధ(20) నగరంలో హౌస్ కీపింగ్ పనిచేస్తుంది. పనిచేసే చోట సాలరీ తీసుకుని వస్తానని జనవరి 29న ఇంటి నుంచి వెళ్లింది. ఆ రోజు రాత్రి అక్కడే ఉండి జనవరి 30న బయలుదేరి వెళ్లింది. కానీ ఇంటికి మాత్రం రాలేదు. కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కారు బోల్తా

### ఒకరికి తీవ్రగాయాలు

నందిగామ: కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన వాజీద్ షాద్‌నగర్ నుంచి కొత్తూరు వైపు కారులో ప్రయాణిస్తున్నాడు. ఆయన కారును అతివేగంగా డ్రైవ్ చేయడంతో చంద్రాయన్‌గూడ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వాజీద్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

## ఏసీపీని కలిసిన సీపీఎం నేతలు



ఏసీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

శంషాబాద్: శంషాబాద్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావును మండల సీపీఎం నేతలు గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మండల కన్వీనర్ నీరటి మల్లేశ్, సభ్యులు ఎర్ర వెంకటేశ్, ఏపూరి పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# కబ్జాదారుల కోరలు పీకేస్తాం

- జీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లల్లో చెరువుల పరిశీలన
- త్వరలో మంత్రి ఉత్తమ్‌తో చెరువుల సుందరీకరణ, అక్రమాలపై రివ్యూ
- కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్ల పరిధిలో మాయమైన చెరువులను మళ్లీ రీస్టోర్ చేసేలా, కబ్జాదారులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. త్వరలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెరువులను పరిశీలిస్తారని తెలిపారు. గతంలో ఉన్న తటాకాల విస్తీర్ణం ఎంత? ఇప్పుడు ఉన్నది ఎంత? భూకబ్జాదారులు ఎవరు? అధికారుల పాత్ర ఏమిటని.. ఉన్నతాధికారులతో రివ్యూ చేస్తామని కేఎల్‌ఆర్ చెప్పారు. చెరువుల పరిరక్షణ సమితి సహా పర్యావరణ పరిరక్షణ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, అఖిల పక్షం నాయకులు పాల్గొని ఈ చెరువుల పునరుద్ధరణ కార్యక్రమానికి సహకరించాలని కేఎల్‌ఆర్ కోరారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

**వ్యక్తి మృతి**



జహంగీర్(ఫైల్)

కొందుర్గు: లారీ ఢీకొట్టడంతో ఓ కూరగాయలు అమ్మే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడకు చెందిన జహంగీర్(61) బుధవారం తన పొలంలో పండించిన కూరగాయాలను విక్రయించేందుకు రామచంద్రాపూర్ సంతకు వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తున్నాడు. మండల కేంద్రం సమీపంలోని స్కాన్ ఐరన్ పరిశ్రమ వద్దకు రాగానే షాద్‌నగర్ నుంచి కొందుర్గు ప్రయాణిస్తున్న లారీ వెనుక నుంచి టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో జహంగీర్ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొందుర్గు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సలహామేరకు నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు అజ్మీర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

రాజేంద్రనగర్: డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష పడినట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఏడుగురిపై కేసు నమోదు చేసి గురువారం ఉదయం రాజేంద్రనగర్‌లోని మూడో ఎంఎం స్పెషల్ న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చామన్నారు. దీంతో జడ్జి ముగ్గురికి జరిమానాతో పాటు జైలు, మిగిలిన నలుగురికి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఆయన పేర్కొన్నారు. మద్యం తాగి నడపవద్దని, అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# రోజుకు రూ.కోటి!

- సైబర్ నేరగాళ్లు స్వాహా చేస్తున్న మొత్తం
- పోలీసుల వరకు రాని ఫిర్యాదులు ఎన్నో
- పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు
- వెల్లడించిన సీసీఎస్ జేసీపీ ఏవీ రంగనాథ్



మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్, డి.కవిత

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో ప్రతి రోజూ నగరవాసులు నష్టపోతున్న మొత్తం సగటున రూ.కోటి ఉంటోందని సంయుక్త పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇది కేవలం పోలీసు రికార్డుల్లోకి ఎక్కుతున్న మొత్తం మాత్రమే అని, బాధితులు బయటకు వచ్చి ఫిర్యాదు చేయనివి కూడా లెక్కిస్తే దీనికి అనేక రెట్లు ఉంటుందని అభిప్రాయపడ్డారు. అయితే సైబర్ నేరాల్లో రికవరీ అయి, బాధితులకు తిరిగి చేరుతున్న నగదు మాత్రం పోయిన దాంట్లో 2 నుంచి 3 శాతం మాత్రమే ఉంటోందని వివరించారు. 2023లో సైబర్ నేరాల్లో నగర వాసులు రూ.140 కోట్ల వరకు నష్టపోగా... ఫిర్యాదు అందుకున్న తర్వాత రూ.44 కోట్లు ఫ్రీజ్ చేయగలిగామని, ఇందులో బాధితులకు తిరిగి ఇవ్వగలిగింది మాత్రం రూ.2 కోట్ల లోపే అని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంలో మీడియా, సోషల్ మీడియా భాగస్వామ్యం పెంచాలని భావించిన ఆయన గురువారం ఆయా సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. డీసీపీ డి.కవితతో కలిసి బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవనంలో సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన నగదు వివిధ మార్గాల్లో విదేశాలకు తరలుతోందని, ఈ కారణంగానే ఉగ్రవాదం, మాదకద్రవ్యాల కోణాన్నీ కేంద్ర ఏజెన్సీలు పర్యవేక్షిస్తున్నాయని రంగనాథ్ పేర్కొన్నారు. బాధితులకు ఉన్న ఆశ, సైబర్ నేరగాళ్లు వేసే ఎర, వారి బెదిరింపులే సైబర్ నేరాలకు కారణమని వివరించారు. ఎవరైనా తాము బాధితులుగా మారామని తెలుసుకున్న రెండు గంటల్లోపే (గోల్డెన్ అవర్స్) ఫిర్యాదు చేయాలని, 1930 నెంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఇటీవల కాలంలో విద్యార్థులకే ఎక్కువగా బాధితులుగా మారుతున్నారని, ట్రేడింగ్, కొరియర్ ఫ్రాడ్స్ బాగా పెరిగాయన్న ఆయన.. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి త్వరలో బ్యాంకర్లు, సోషల్‌మీడియా నిర్వాహకులతో సమావేశం కానున్నట్లు వివరించారు. సైబర్ నేరాలపై ప్రచారం కోసం సినీ తారల సహాయం తీసుకోనున్నట్లు రంగనాథ్ పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్లను తెలిసి తెలియక వినియోగిస్తున్న వృద్ధులు సైతం బాధితులు అవుతున్నారని, ఇటీవలే రూ.1.1 కోటి కోల్పోయిన ఓ వృద్ధ జంట తమకు ఫిర్యాదు చేసిందన్నారు.

### నేనూ సైబర్ నేరగాడిని అనుకున్నారు

పోలీసుల పేర్లతో ఫోన్లు చేసి, వీడియో కాల్స్‌లో యూనిఫాంలో కనిపించి డబ్బు దండుకునే మోసాలు పెరిగా యి. డీప్ ఫేక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఈ నేరాలు చేస్తున్నారు. ఇటీవల ఓ కేసుకు సంబంధించిన వివరాల కోసం ఓ సంస్థను సంప్రదించాల్సి వచ్చింది. వారితో మాట్లాడగా.. నన్ను సైబర్ నేరగాడిగా అనుమానించి 'మీరు జాయింట్ సీపీ అని నమ్మ కం ఏంటని?' అడిగారు. దీంతో నేను వారికి వీడియో కాల్ చేసి, మా టీమ్‌లోని అధికారుల్లో వారికి పరిచయం ఉన్న వారిని చూపించా. ఓ యువతి రూ.3 కోట్లు కోల్పోయింది. వ్యాపారంలో నష్టాలతో అప్పుల్లో మునిగిపోయిన కుటుంబ పెద్ద తన ఆస్తిని అమ్మగా వచ్చిన రూ.3 కోట్లు కుమార్తె (21) ఖాతాలో వేశారు. తన తండ్రి ఆర్థిక ఇబ్బందులు గమనించిన ఆమె ఈ డబ్బుతో ట్రేడింగ్ చేసి ఆయనకు సహకరించాలని భావించింది. అవగాహన లేమితో సైబర్ నేరగాళ్ల బారినపడి ఆ మొత్తం నష్టపోయింది. విషయం తెలి సి కుటుంబ పెద్ద దూరంగా వెళ్లిపోయారు. సైబర్ నేరాల్లో ఇలాంటి కదిలించే కథలు ఎన్నో ఉంటాయి.

– ఏవీ రంగనాథ్, జేసీపీ, సీసీఎస్